**Andhra Jyothi**

# వయోపరిమితి 40 ఏళ్లు

- సెప్టెంబర్ నెలాఖరులోగా అన్ని నోటిఫికేషన్లూ ఇస్తాం
- నిరుద్యోగులు ఆందోళన చెందొద్దు
- నోటిఫికేషన్ వచ్చిన ఆరు నెలల్లో నియామకాలు
- ఆన్‌లైన్‌లోనే అన్ని పరీక్షలు.. స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది
- నియామకాలపై వచ్చే ఏడాది నుంచి కేలండర్
- ఏపీపీఎస్సీ చైర్మన్ ఆచార్య ఉదయభాస్కర్ వెల్లడి

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అన్ని కేటగిరీల్లో కలిపి 4009 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ ఆచార్య పి.ఉదయభాస్కర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆమోదం లభించిన 4009 పోస్టులకు నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అన్ని నియామకాలకు సెప్టెంబర్ నెలాఖరులోగా నోటిఫికేషన్లు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అన్ని పోస్టులకు వయోపరిమితి 40 సంవత్సరాలని తెలిపారు.



వయోపరిమితిని 34 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన అనుమతి సెప్టెంబర్ నెలాఖరుతో ముగుస్తుందని, అప్పటిలోగా అన్ని నోటిఫికేషన్లూ విడుదల చేస్తున్నందున నిరుద్యోగులు ఆందోళన చెందనవసరం లేదని సూచించారు. బుధవారం ఆయన ఇక్కడి సర్క్యూట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒకవేళ ఏదైనా కారణంతో ఒకటి, రెండు ప్రకటనలు విడుదల కాకపోయినా వాటికి సంబంధించి దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు 40 ఏళ్ల వయోపరిమితి వర్తింపజేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరతామన్నారు. శాఖల వారీగా ఖాళీల వివరాలు అందిన వెంటనే ప్రకటనలు విడుదల చేస్తామన్నారు. సివిల్ ఇంజనీర్ పోస్టుల వివరాలు అందగానే నోటిఫికేషన్ విడుదల చేశామని గుర్తుచేశారు. సర్వీస్ కమిషన్ అనగానే నియామకాలకు కాలయాపన ఉంటుందన్న అపప్రథ పోగొట్టడానికి ప్రకటన విడుదల చేసిన నుంచి ఆరు నెలల్లో పోస్టింగ్‌లు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. కోర్టు కేసుల ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. 'నియామకాలకు సంబంధించి వచ్చే ఏడాది నుంచి కేలండర్ రూపొందించి అమలు చేస్తాం. అంటే ఒక సంవత్సరం ఒక తేదీన ఒక కేడర్ పోస్టులకు ప్రకటన విడుదల చేస్తే మరుసటి ఏడాది అదే తేదీన ప్రకటన వస్తుంది' అని తెలిపారు.

## ఆన్‌లైన్ పరీక్షలతో సమస్యల్లేవు

సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని ఉదయభాస్కర్ చెప్పారు. ఇటీవల డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించామని, ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు. ఆన్‌లైన్ పరీక్షలో ఒక అభ్యర్థికి మరో అభ్యర్థికి ఇచ్చే పేపర్‌లో అనేక మార్పులుంటాయని, దీనివల్ల మాస్‌కాపీయింగ్‌కు కూడా అవకాశం ఉండదని చెప్పారు. ఐదేళ్ల తరువాత వరుసగా ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తున్నందున భారీగా పోటీ ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిదానికి ముందుగా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి 1:50 నిష్పత్తిలో వడపోత ఉంటుందని తెలిపారు. తరువాత చివరి పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. యూపీఎస్సీలో 1:12 విధానం ఉందని, భవిష్యత్తులో దీనిని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. గ్రూప్-1 తప్ప మిగిలిన పోస్టులకు ఇంటర్వ్యూలు ఉండవని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం నిర్వహించనున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. 1999లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల ప్రతిష్టంభనపై సవరించిన నిబంధనల మేరకు పోస్టుల నియామకానికి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపిస్తామన్నారు. అప్పట్లో పరీక్షలను ఏపీపీఎస్సీ నిర్వహించినందున తెలంగాణలో ఉన్న అభ్యర్థులకు కూడా తామే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఉదయభాస్కర్ వెల్లడించారు.